# రాలని పూలు

సరిత నందనవనంలా విరబూసిన పూలని మురిపెంగా చూస్తోంది తనగది కిటికీలోనుండి. ఆమె తోటలో ఎన్నో పూలమొక్కలు సన్నజాజులు, సంపెంగలు, పొన్నలు, పారిజాతాలు, మల్లెలు, మందారాలు, చామంతులు, కనకాంబరాలు, గులాబీలు - ఎన్నో. పారిజాతాలంటే ఆమెకిష్టం. అవి మంచి మనుష్యులను, అందమైన మనసులను గుర్తుకు తెస్తూంటాయామెకు. కింద ఎర్రటి కాడ, పైన తెల్లటి ఆకర్షణ పత్రాలు. ఎర్రటి కాడ మనిషి భౌతిక తత్వాన్నీ, తెల్లటి పత్రాలు మనిషి ఆత్మతత్వాన్నీ వెలుగునీ ఆమెకు గుర్తుకు తెచ్చే ప్రతీకలు.

ఆమెపూలు కోయదు, ఎవరికయినా తనవాళ్ళకివ్వాలనిపిస్తే తప్ప. మరెవర్నీ కోయనివ్వదు. నిన్న విచ్చుకున్న పూలు రాలిపోయాయి. ఇవాళ మరికొన్ని విరబూశాయి. రాలిన పూలు ఆమెలో గతస్మృతులను రేపుతాయి. ఊహల ఆకాశంలో విహరింపచేస్తాయి.

ఆ రాలిన పూలనుచూస్తుంటే ఆమెకు ముందుగా పరిమళ గుర్తుకువచ్చింది. పన్నెండేళ్ళ చిన్నారి పాప ఆమె. ఓసారి తుఫాను బాధితుల సహాయార్థం చందాలు వసూలుచేస్తూ, దానికోసభ ఏర్పాటు చేసి, కల్చరల్ ప్రోగ్రామ్స్ కూడా పెట్టారు. దానికి సరిత వెళ్ళింది.

ఆ సభలో ఆ చిన్నారి పాడింది. అద్భుతంగా, అపూర్వంగా పాడింది. అంత చిన్న వయసులో అంత చక్కగా ఎలా పాడగలిగింది? ఆ గాంధర్వం ఇప్పటిది కాదు, ఎన్ని జన్మలనుండి సంతరించుకున్నదో? సాధనవల్ల వచ్చింది కాదు అది. ఈ లోకానికి వస్తూ తనతో తెచ్చుకున్న విద్య అది.

కార్యక్రమం ముగిశాక పాపని సమీపించింది సరిత.

''నీ పేరేంటి?'' అడిగింది సరిత

''పరిమళ''

''చాలా బాగా పాడావు పరిమళా! సంగీతం నేర్చుకున్నావా?''

''ఊహూఁ మా అమ్మ పాడ్తుంటే వింటానంతే''

సరిత ఊహే నిజం.

''ఏ వూరు మీది?''

''ఖమ్మం. ఎందుకండీ?'' అంది అమాయకంగా

''ఊరికే. మీ అడ్రసు రాసి ఇస్తావా?'' అడిగింది సరిత. ఆమె పెత్తండ్రి సినీ ఫీల్డులో వున్నాడు. ఆయనద్వారా ఆపాపకు ఏదైనా సినిమాలో పాటలుపాడే అవకాశం ఇప్పిద్దామనే ఉద్దేశంతోనూ, వీలైతే ఇంకెప్పుడైనా ఆమె పాటలు వినవచ్చనే ఊహతోనూ ఆపాప చిరునామా అడిగింది.

కానీ వెంటనే ఆ పాప మొహంలో కలవరం కన్పించింది. తన చిరునామా తీసుకుని తననేమి చేస్తుందో అన్నట్లుంది.

''ఎందుకు భయపడ్తున్నావు? నేనేం నిన్ను కిడ్నాప్ చెయ్యనులే'' అంది సరిత నవ్వుతూ.

ఆ పాపకి ఆమాట అర్థమయిందో లేదో కాని పక్కనున్న క్రచెస్ చంకనిరికించుకుని టకటకామనిపించుకుంటూ పదిమందిలోకి వెళ్ళిపోయింది.

సరిత చిత్రంగా చూస్తూ నిలబడి పోయింది. 'అయ్యో ఆ పాపకు పోలియోనా? అంత చక్కటి గొంతు నిచ్చిన ఆ పరాత్పరుడు కాళ్ళను తీసుకెళ్ళిపోయాడేం' అంతుపట్టలేదామెకు. చక్కటిపాట ఎప్పుడు విన్నా పరిమళ గుర్తుకొస్తుంది సరితకు. అగరు ధూమపు తీగల్లాసాగి, రింగులు చుట్టుకుంటూపోయి, గాలివాటుకు ఎటెటో తిరిగి హృదయాన్ని మెలిపెట్టేంత తీయగా, బాధగా పరిమళ అపూర్వ గాంధర్వం ఆమెకు గుర్తుకు వస్తుండేది. దాంతో పాటుగా ఆమె పోలియోకాళ్ళు గుర్తుకొచ్చి హృదయం మూగపోయేది.

సరిత మనో నందనంలో మరో రాలని పువ్వు రాధిక. ఆమె కృష్ణుడు - ఆమె భర్త- ఆమె జీవితంలో నుండి, అతని జీవితాన్నుండి, తప్పుకుని ఎంతోకాలం కాలేదు, సరితకు రాధిక పరిచయమయ్యేనాటికి. తన మోహనుడి మురళీరవళి వినిపించక ఆమె హృదయం పువ్వులా ముకుళించుకుపోయింది. గుండెజబ్బుతో ఆసుపత్రిలో చేర్చారు. అప్పుడు సరిత ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రిలో హౌస్ సర్జన్ చేస్తోండేది. కార్డియాలజీ వార్డ్‌కి వెళ్ళినప్పుడల్లా రాధికను చూస్తూ వుండేది సరిత. భర్త బతికున్నప్పుడు బాగానే పనిచేసిన గుండెవాల్వులు, అతడు పోయింతర్వాత పనిచేయటం మానేశాయి. వాల్వ్ సరిగ్గా పనిచేయక చెడురక్తాన్ని గుండె బయటకు పంప్ చేయనప్పుడల్లా ఆమె ముఖం నీలివర్ణంగా మారిపోయేది. తాత్కాలికంగా మందులు, మసాజ్ చెయ్యటాలు, ఆక్సిజన్ పెట్టటం అన్నీ జరిగి పోతూ వుండేవి. ఆవాల్వ్‌ని రిపేరు చెయ్యాలి అన్నారు డాక్టర్లు. ఆమెను అబ్జర్వేషనులో వుంచారు.

ఛీఫ్‌తో కలిసి రవుండ్లకు వచ్చినప్పుడు ఆమె గురించి ఆయన చెప్పే మాటలేవీ సరితకు చేరేవికావు. రవుండ్లయిపోయిన తరువాత, వెళ్ళబోతూ రాధిక దగ్గరకు వచ్చి పలకరించేది.

''ఎలా వున్నారు? ఇవాళ....'' అని

''బానే వున్నాను. ఏదీ నా పువ్వు'' అని అడిగేది రాధిక.

సరిత వచ్చినప్పుడల్లా ఆమె తన తోటలోనుండి ఓ ఎర్ర గులాబీపూవు తెచ్చి ఇచ్చేది రాధికకు. ఎందుకో ఆమెకు మరో పువ్వు ఇవ్వాలనిపించేదికాదు సరితకు. ఆమెకసలు పువ్వునివ్వవచ్చో లేదో తెలీదు సరితకు. రాధిక విధవ. పువ్వులేం చేసుకుంటుంది? కాని ఎర్ర గులాబీలు చూడగానే రాధిక హృదయం సంతోషంతో గంతులు వేసేది. ఆ నవ్వుమొహం చూడాలనే ఆమెకు గులాబీ తెచ్చిచ్చేది సరిత.

సరిత తన బాగులోనుండి గులాబి తీసి ఇచ్చింది. ఆనందంగా దాన్ని స్వీకరిస్తూ అంది రాధిక. ''రోజూ నాకోసం పూలుతెస్తున్నావు. నేనూ నీకో చక్కని పువ్వునిస్తాను. కాయితం పువ్వది. నీ పువ్వంత అందమైంది కాకపోయినా అదీ అందమైందే'' అని పక్కనే తనమందులూ, సామాన్లూ పెట్టుకునే స్టాండులో నుండి ఓ డ్రాయింగ్ పేపర్ తీసి ఇచ్చింది రాధిక.

అది ఆర్ట్‌పేపర్. దానిమీద ఇండియన్ ఇంక్‌తో సరిత బొమ్మవేసివుంది. డాక్టర్లేసుకునే కోటూ, స్టెత్ అన్నీ వున్నాయి. కోటుమీద గులాబీ చిత్రించి వుంది. అంత చక్కగా తన పోలికలు తీసుకుని వచ్చేటట్లు రాధిక బొమ్మ వెయ్యగలదని, అసలామె ఆర్టిస్టనీ సరితకు తెలియదు.

''మీరు బొమ్మలు వేస్తారా?''

''అదేం మాట. బొమ్మగీసిచ్చినా నమ్మకం లేదా?'' అంది రాధిక

''ఎంత బాగావేశారు? అచ్చం నేనే!!''

''ఇంకా కొంచెం కొరత మిగిలిపోయింది'' అంటూ ఆడ్రాయింగ్ తీసుకుని పెన్నుతో ఓ మూల 'టు సరిత - విత్ లవ్' అని రాసి సంతకం చేసి ఇచ్చింది ఆమె.

''నా పువ్వులు వాడిపోతాయిగాని, మీరిచ్చిన పువ్వు వాడిపోదు.''

''మంచి మనసున్న నువ్వే ఓ కుసుమానివి. ఓ పారిజాతానివి''

''కళాకారులు మీరు. కలల్లో తేలిపోవటం సహజం''

''కళ మనిషిని చైతన్యవంతం చేస్తుంది. ప్రకృతి లాంటిది కళ. అశాశ్వతమైన మనుషులు నశిస్తారుకాని, కళా - ప్రకృతి అలా శాశ్వతంగా నిలిచిపోతయ్యి. టెన్నిసన్ కవి సెలయేరు అన్నది. 'మెన్ మే కం అండ్ గో, బట్ ఐ గో ఆన్ ఫరెవ్వర్' అని. ఇవాళ నేనున్నాను. రేపు నేను పోయినా నాబొమ్మ పోదు.'' అంది రాధిక ఎటో చూస్తూ

''భలేవాళ్ళే. మీరెక్కడకు పోతారు? మేం మిమ్మల్ని ఎక్కడికీ పోనీం''

''అందరమూ పోవాల్సిన మాటేగా ఓ రోజు. ఆయన పోయారు. నేనూ ఎప్పుడో వెళ్ళిపోతాను'' అంది ఆమె నిర్వేదంగా.

రాధిక అన్నట్లుగానే ఆమె ఎక్కువ రోజులు బతకలేదు. ఓరోజు గుండెలో వాల్వు పనిచెయ్యనని సమ్మెచేసింది. డాక్టర్ల ప్రయత్నాలన్నీ విఫలమయాయి. అనంత సౌందర్యాన్ని చిత్రించటానికై తిరిగి

రాని సుందర లోకాలకు వెళ్ళిపోయింది రాధిక. పరిమితి కలిగిన ప్రపంచంలో పరిపూర్ణమైన సౌందర్యాన్ని సృజించటం సాధ్యంకాదు. అందుకనే పరిమితుల్లేని పరిపూర్ణత వేపు సాగిపోయింది రాధిక.

ఆమె గుర్తుకువచ్చినప్పుడల్లా సరిత కళ్ళల్లో నీళ్ళు నిలిచేవి. రాధిక వేసిన తన బొమ్మ ఎప్పుడూ ఆమెను గుర్తుకు తెస్తూ వుండేది. ఆ బొమ్మలో తన మెడలో వున్న స్టెత్ చూసినప్పుడల్లా అరవింద్ గుర్తుకువస్తాడామెకు. చాలా మందికి స్టెతస్కోప్ అలంకారం, డబ్బు సంపాదించే సాధనం. స్టెతస్కోపుకే అలంకార ప్రాయమైనవాడు అరవింద్.

అరవింద్ సరిత క్లాసుమేటు. ఎక్కడ పుట్టాడో ఏ వూరి వాడో ఎవరికీ తెలీదు. చదువుకునే రోజుల్లో చాల కష్టపడేవాడు. ఫీజులు కట్టటానికీ, మిగిలిన అవసరాలకీ డబ్బుండేదికాదు. సాయంత్రాలు ప్రెస్‌లలో ప్రూఫ్ రీడర్‌గా పనిచేసేవాడు. అదీ దొరక్కపోతే కంపోజిటర్‌గా చేసేవాడు. పొద్దునపూట ట్యూషన్లు చెప్పేవాడు. ఇన్నిపనులు చేసినా కాలేజీలో చదువులో ప్రథముడిగా వచ్చేవాడు. ఒకోసారి మాసిన గుడ్డలు వేసుకు వచ్చేవాడు కాలేజికి. అదే వేరెవరయినా అయితే తోటి విద్యార్థులు గేలిచేయకుండా వుండేవాళ్ళు కాదు. అతని తెలివితేటల పట్ల గౌరవం చూపించేవాళ్ళు ప్రొఫెసర్లు. అతని కళ్ళలో ఓ వెలుగువుండేది. అతను కళ్ళెత్తిచూస్తే ఎవరూ ఏమనలేకపోయేవాళ్ళు. అతని బీదరికం దీనత్వాన్ని కలిగించేదిగా వుండేదికాని, అతనెపుడూ దీనంగా, మరొకళ్ళని దేబిరించేట్టుగా ఉండేవాడుకాదు. అతనికి సాయం చెయ్యాలని తోటి విద్యార్థులు అనుకునేవారు. అతడు వూరికే ఎవరి సాయమూ అర్థించేవాడుకాదు. అందువల్ల ఆదివారాలు అతనిచేత తమ రికార్డులు వేయించుకుని డబ్బునిచ్చేవాళ్ళు తోటి విద్యార్థులు.

అతనుండేది కూలిజనం వుండే బస్తీలో - బీదల బస్తీలో. ఓ గుడిసెలో అద్దెకుండేవాడు. పుస్తకాలు కొనుక్కోవటానికి డబ్బులుండేవికాదు. మిత్రులనడిగి తీసుకుని, చదివి, నోట్సు రాసుకుని తిరిగి ఇస్తూండేవాడు. అతనికో క్షణం తీరిక వుండేదికాదు. యంత్రంలాగ పనిచేసేవాడు. అతను ఫైనలియర్ చదివేరోజుల్లోనే బీదల బస్తీలో జనం పెద్ద డాక్టర్ల దగ్గరకు వెళ్ళే స్తోమత లేక అరవింద్ దగ్గరకు వస్తూవుండేవాళ్ళు. అతను వాళ్ళ దగ్గరేం డబ్బు తీసుకునేవాడుకాదు. 'మందులు కొంటానికి కూడా వాళ్ళ దగ్గర డబ్బులేదే, తనేం సాయం చేయలేకపోతున్నానే' అని వాపోయేవాడతను.

''వాళ్ళకు వూర్కేనే వైద్యం చేయటమెందుకూ? తృణమో ఫణమో పుచ్చుకోరాదూ'' అనేది సరిత అతనితో.

''వాళ్ళ దగ్గరేముంది ఇవ్వటానికి. అయినా దేశం మనపై ఇంత ఖర్చుపెట్టి చదివిస్తోందికదా! వాళ్ళ రుణం తీర్చుకోవద్దూ. వాళ్ళకివ్వాల్సింది పోయి, వాళ్ళ దగ్గర తీసుకునేదా?'' అనేవాడు అతడు.

''పోనీ మధ్యతరగతి వాళ్ళకో, ధనవంతులకో వైద్యం చెయ్యరాదూ! వాళ్ళకు నీకు ఫీజు ఇవ్వగలిగే స్తోమత వుంటుంది.'' అనేది ఆమె.

''వాళ్ళు నాదగ్గరకు రారు. నేను ఇంకా డాక్టరు పట్టా పుచ్చుకోలేదు. వాళ్ళకు వైద్యం చేయజూస్తే పోలీసుకేసు కూడా పెడ్తారు నాపై'' అనేవాడతను.

ఫైనలియర్ పరీక్ష ఫీజు కట్టటానికి తన దగ్గర డబ్బులేదు. సరిత తనివ్వజూసింది. అతనికేం గత్యంతరం తోచలేదు. ఏప్రిల్ అయిపోవటంవల్ల ట్యూషన్లు కూడా లేవు. ''మరి ప్రతిఫలంగా నేనేం చెయ్యగలను మీకు?'' అన్నాడతను వట్టిగా ఆమెదగ్గర డబ్బు తీసుకోవటం ఇష్టంలేక.

''ఏం చెయ్యక్కరలేదు. మీరు డాక్టరైంతర్వాత అప్పుతీరుద్దురుగాని'' అంది ఆమె.

''అలాకాదు. ఎప్పటి రుణం అప్పుడు తీర్చెయ్యాల్సిందే. పొద్దునపూట నేనెలాగూ ఖాళీనే. ఓ వారంరోజులు వచ్చి మీ తోటపనిచేసి పెడతాను. మొక్కలు పెంచటం నాకు తెల్సు. మీరేం భయపడక్కరలేదు'' అన్నాడతను.

అతనికేది చెప్పి సమాధాన పర్చలేమని ఆమెకు తెల్సు. అతడు చెప్పిందానికంగీకరించక తప్పలేదు ఆమెకు.

డాక్టరయినా అతని జీవనస్థాయేం పెరగలేదు. బీదలబస్తీలో తన గుడిసె ముందుబోర్డు పెట్టాడు. తీరిక లేనంత ప్రాక్టీసేగానీ, హాయిగా బతకటానికి కాకపోయినా, కనీసావసరాలకు సరిపోయే డబ్బుకూడా వచ్చేదికాదు. బీద పేషెంట్లు ఖరీదయిన ఇంగ్లీషు మందులు కొనలేకపోతున్నారని, చవకమందులున్న హోమియోపతీ వైద్యవిధానం నేర్చుకోవటం మొదలుపెట్టాడతను.

''మీరు వీళ్ళకేం చెయ్యగలరు? ప్రభుత్వమే తలపెట్టాలి. మీరుబయట వేరే లొకాలిటీలో ఎక్కడయినా ప్రాక్టీసు పెట్టండి. డబ్బు సంపాదించగలరు. కావాలంటే వాళ్ళతోపాటు వీళ్ళకీ వుచితంగా వైద్యం చేద్దురుగాని'' అనేది సరిత.

అతను నవ్వేవాడు.

''ప్రభుత్వంవాళ్ళకు అందించవల్సింది వైద్యం కాదండీ. చదువుకూడా కాదు. రెండు పూట్లా కడుపునింపేంత అన్నం. ఆ అన్నం సంపాదించగలిగే పని. దోపిడి లేని సామాజిక న్యాయం కల్గించేపని. పనిదొరికితే అన్నం, చదువు, వైద్యం, రిక్రియేషన్ వరసగా అన్నీ వస్తాయి. మనదేశంలో చావటానికి హక్కులేదుగానీ, బతకటానికి ఆసరాలేదు''అనేవాడతను.

డాక్టరుగా బోర్డుకట్టి తరువాత రెండేళ్ళుమాత్రం అక్కడ వున్నాడు. ఆతరువాత ఎవరికీ చెప్పా చెయ్యకుండా వెళ్ళిపోయాడు. 'తన వూరెళ్ళిపోయుంటాడు' అన్నారుకొందరు. 'పూటకి గడవటం కష్టమై వెళ్ళిపోయాడు' అన్నారు మరికొందరు. 'తీవ్రవాదుల్లో కలిసి పోయుంటాడు'

అని సందేహం వెలిబుచ్చారు ఇంకొందరు. అతనేమయినా, ఎక్కడున్నా దీనహీనజనుల మధ్యే వుంటాడు. అతనికి స్వంత జీవనంలేదు. పుట్టింది ఇతరుల కోసమే అన్నట్టు బతికేమనిషి అతను. దరిద్ర నారాయణుడతను.

ఆ మహామానవుడెక్కడున్నాడో సరితకు తెలీదు. అతను గుర్తుకొచ్చినప్పుడల్లా సరిత హృదయం చిక్కపట్టినట్లు వుండేది.

పూలు రాలిపోతాయి. ఈ పూలురాలిపోవు. ఓ సారి పరిచయమై, సన్నిహితంగా మెలిగి, మనహృదయతంత్రుల్ని మీటి మళ్ళీ తిరిగి రాకుండా వెళ్ళిపోయేవాళ్ళంతా మన మనసుల్లో వికసించి, సదా వాళ్ళ వ్యక్తిత్వపు పరిమళాలు వెదజల్లుతూ నిలచిపోతారు. పరిమళ పున్నాగపూవు, రాధిక గులాబి, అరవింద్ పారిజాతం - అలా మన స్మృతి పథంలో ఎన్నో పూలు వికసిస్తాయి. ఈ పూలు రాలవు. రాలని పూవులివి.

'ఆంధ్రజ్యోతి' దినపత్రిక ఆదివారం అనుబంధం
16-4-1989


శుభాకాంక్షలతో

**దాసరి వెంకటరమణ**

(కథారచయిత)

5-5-5/4, క్రాంతీ హిల్స్
వనస్థలిపురం
హైదరాబాద్
ఫోన్ : 402 2611